క్లుప్తంగా

16న ఉచిత మెగా వైద్య శిబిరం

గుడివాడ టౌన్(నందివాడ): డాక్టర్ వైఎస్సార్ వైద్య విభాగం, ఇలపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ మండలం కాళింగిపేట జెడ్పీ హైస్కూల్ వద్ద ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ మలిరెడ్డి రవి, తదితర వైద్యులతో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి మెరుగైన వైద్య సేవలు కోసం ఇతర వైద్య శాలలకు పంపనున్నట్లు ఇలపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమిత సంఘం అధ్యక్షుడు సుంకర వెంకటరమణ, శీతయ్య, రోమేశ్వర రావు పేర్కొన్నారు.

పామర్రు ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



పామర్రు: పామర్రు ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన అవినాష్ ఉయ్యూరు రూరల్ కు బదిలీ కావడంతో ఆస్థానంలో కృష్ణాజిల్లా స్పెషల్ బ్రాంచ్ నుంచి ప్రవీణ్‌కుమార్ ఇక్కడకు వచ్చారు. అనంతరం పామర్రు సీఐ వెంకటనారాయణ, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ కొత్తగా వచ్చిన ఎస్ఐని అభినందించారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రాం చిత్రపటాల ఏర్పాటు

గుడివాడ టౌన్: స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం చిత్రపటాలను స్థానిక ఎస్.పి.ఎస్ హైస్కూల్లో బుధవారం ఏర్పాటు చేశారు. హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గుడివాడ సుమిత్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ చిత్రపటాలకు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టీఎంఈ రాణి, పీఈటీ మడక ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

గుడివాడ టౌన్: ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆది మానంధ్రా సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగిలేటి జయరాజు పిలుపునిచ్చారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక బాపూజీనగర్ నుంచి కోతి బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందని, అన్ని వార్డుల అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలబాలికలకు సమ్మర్ క్యాంప్

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్–2023 నిర్వహిస్తున్నట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కూడా వివిధ రకాల క్రీడాలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 ఏళ్ల లోపు బాల బాలికలకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. అథెట్లిక్స్, బాస్కెట్‌బాల్, శాస్త్రీయ నాట్యం, చెస్, క్రికెట్, కబడ్డీ, కరాటే, ఖో–ఖో, షటిల్, స్కేటింగ్, వాలీబాల్, యోగ, వెయిట్ లిఫ్టింగ్ (13 నుంచి 18 ఏళ్ల వయసు గలవారు), వెస్ట్రన్ డ్యాన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. వేసవి శిక్షణ తరగతులలో చేరదలచుకున్న బాలబాలికలు స్టేడియం ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మే 1వతేదీ నుంచి 28 వరకు జరిగే ఈ శిక్షణలో ఆదివారం సెలవు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివసుబ్రహ్మణ్యేశ్వర రావు (చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, శాశ్వత సభ్యులు నెరుసు శేషగిరిరావు, బగ్గారపు తిరుపతయ్య, చింతా రఘు, కే రంగప్రసాద్ పాల్గొన్నారు.

కృష్ణమూర్తి సేవలు మరువలేనివి

ముదినేపల్లి రూరల్: సీపీఎం నేత బోయిన కృష్ణమూర్తి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆయన మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన స్వగ్రామమైన మండలంలోని దేవపూడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రసాద్ మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు ఉల్లంకి నాంచారాయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు శేషపు మహంకాళిరావు, దండుపోయిన త్రిమూర్తులు, మట్లపూడి కనకరావు, కుటుంబరావు, సీతమ్మ, మాధవ, జ్ఞానేషు, వినోద్, ప్రకాష్, శ్రీకాంత్, రాంబాబు, యాకోబు, సోమయ్య, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)



సంఘర్షణపురంలో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలోని బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని సంఘర్షణపురం, పెనుమల్లి, వడాలి, శ్రీహరిపురం, సింగరాయపాలెం, పెదగొన్నూరు, కొరగుంటపాలెం, అల్లూరు, చిగురుకోటలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి ముఖ్యమంత్రి జగనన్న స్టిక్కర్లు అంటించడంతో పాటు ప్రభుత్వ పాలనతీరుపై అభిప్రాయణ సేకరణ చేశారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వానికి గత టీడీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించడంతో పాటు సెల్‌ఫోన్లకు సీఎం స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, మండల జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, ఎంపీటీసీ వీరమల్లు కొండలరావు, పెనుమల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ముత్యాల రాంబాబు, పలువురు ఎంపీటీసీల సభ్యులు, సర్పంచ్‌లు, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి పేర్ని పృధ్వీ, పార్టీ నేతలు కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, షేక్ అల్లాభక్షు, శీలం రామకృష్ణ, గూడపాటి వరప్రసాద్, గంటా కోటేశ్వరరావు, స్థానిక సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఇంటింటా ‘మా నమ్మకం నువ్వే జగన్’



పామర్రులో సీఎం జగన్ స్టిక్కర్లను అతికిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామర్రు: జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరడంతో ప్రజలు అందరూ ‘మా నమ్మకం నువ్వే జగన్’ అంటూ రానున్న కాలంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే తమ మద్దతు తెలుపుతామని అంటున్నారు. పామర్రు సచివాలయం 4 పరిధిలోని 14వవార్డులో జగనన్న నువ్వే మా భవిష్యత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఇంటి తలుపులకు, సెల్ ఫోన్లకు సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ఎం.సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరావు, వార్డు మెంబరు ఆరేపల్లి శ్రీహరి, నాయకులు బి.మాధవరెడ్డి, బి.గోవర్ధనరెడ్డి, శేషురెడ్డి, మల్రెడ్డి అంజిరెడ్డి, ఎస్ సాంబిరెడ్డి,కూనం పెద వెంకటరెడ్డి, జె.అంజి పాల్గొన్నారు.

కైకలూరులో ‘జగనన్నే మన భవిష్యత్తు’

కై కలూరు: ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశాల మేరకు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం స్థానిక నాలుగో సచివాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్వచ్ఛందంగా ‘మా నమ్మకం నువ్వే జగన్’ స్టిక్కర్‌ను లబ్ధిదారులు తీసుకువెళ్లి తమ ఇంటి తలుపులకు అంటించుకున్నారు. రాంబాబు, మోహనరావు, గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యదర్శులతో డీపీఓ సమీక్ష సమావేశం

మండవల్లి: జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణ మండలంలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 కార్యదర్శులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో విధివిధానాలు, నిర్వహించాల్సిన రిజిష్టర్లు, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు, పంచాయతీ జమ ఖర్చుల వివరాలు వంటి అంశాల నిర్వహణ, నిర్వహణలో ఎదురయ్యే లోటుపాట్లపై చర్చించి, తగు సూచనలు చేశారు.

విదేశాల్లో ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ కుశాల్ మహోత్సవంలో భాగంగా యువతకు విదేశాల్లో ఉపాధి కలిప్తూ జాతీయ నైపుణ్య అభివద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దానికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, ఏదైనా ఉన్నత విద్య పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 16వ తేదీలోగా రిజిస్ట్రేషన్ ముగుస్తున్నందున ఆసక్తి గలవారు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఉచితమని పేర్కొన్నారు. వివరాలకు 85559 52320లో సంప్రదించాల్సిందిగా కోరారు.

‘నిన్ను నమ్మలేం బాబు’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కాళి తదితరులు

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రజలు ఇప్పటికే చంద్రబాబును నమ్మి చాలా మోసపోయారని ఇకపై చంద్రబాబును నమ్మేది లేదు మోసపోయేది లేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ అన్నారు. స్థానిక రాజేంద్రనగర్ బైపాస్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో బుధవారం ‘నిన్ను నమ్మలేం బాబు... మళ్లీ మోసపోలేం బాబు’ అంటూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాళీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఇంటి ముందుకు సంక్షేమ పథకాన్ని తీసుకొచ్చే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తుంటే, నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ రాష్ట్ర పర్యటన అంటూ ప్రభుత్వంపై అసత్యాలు ప్రసారం చేస్తూ తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కష్ణాజిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కల్లేపల్లి పవన్, వైఎస్సార్ సీపీ జిల్లా సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ తోట రాజేష్, జిల్లా ఎస్సీ నాయకులు మామిళ్ల రాజేష్, మైనార్టీ విభాగం నాయకులు అలీ బేగ్ పాల్గొన్నారు.

జేవీకే కిట్ల స్టాక్‌ను పరిశీలించిన డైరెక్టర్



ఎంఈఓ మెటల్దారాణితో మాట్లాడుతున్న డైరెక్టర్ మస్తానయ్య

పెదన: విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి ఇవ్వనున్న జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్‌ను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్ రాష్ట్ర డైరెక్టర్ వీఎస్ మస్తానయ్య బుధవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మార్సీ భవనం (బంగ్లా స్కూల్)ను సందర్శించిన ఆయన కిట్లకు సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. నాలుగో విడత పంపిణీకి సంబంధించి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మెటల్దారాణి పూర్తి సమాచారం అందజేశారు. సీఆర్పీలు, ఐఈఆర్‌టీలతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. మండల స్థాయిలోని క్వాలిటీ కంట్రోల్ టీంలో మండల ఇంజినీరు, ఏపీఎంలు సభ్యులుగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంఓ జి. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపాలెం మహాకుంభాభిషేక ఉత్సవాలపై శోభాయాత్ర

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నాయణస్వామి వారి ఆలయంలో జరుగనున్న మహా కుంభాభిషేక మహోత్సవాల ప్రచారంలో భాగంగా బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజీయర్ స్వామీజీ ఆలయ ప్రాంగణం వద్ద శోభాయాత్రను ప్రారంభించారు. శ్రీమన్నారాయణుడి ఆలయం నిర్మించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30 నుంచి మే నెల 12వ తేదీ వరకు 12 రోజుల పాటు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామని అష్టాక్షరీ స్వామీజీ చెప్పారు. మే 12న కుంభాభిషేకం జరిపి, అదే రోజు లక్ష మందికి మహా అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆకట్టుకుంది.

నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.3.44 లక్షలు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయానికి హుండీ ద్వారా రూ.3.44 లక్షల ఆదాయం లభించింది. అమ్మవారి ప్రధాన జాతర నిర్వహించి నెల రోజుల పూర్తి కావడంతో ఈ నెల 5న అమ్మవారి నెల సంబరాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవదాయ శాఖాధికారులు బుధవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. నెల రోజులకుగాను అమ్మవారి హుండీ ద్వారా రూ.3,44,930 ఆదాయం లభించిందని ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. మార్చి 5,6,7 తేదీల్లో జరిగిన అమ్మవారి ప్రధాన జాతర సందర్భంగా ఆలయానికి రూ.16.52 లక్షల ఆదాయం లభించిందని, నెల సంబరంతో కలుపుకొని నెల రోజుల్లో మొత్తం రూ.19.96 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరిందని ఈఓ వివరించారు.

ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): రెండో నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో నియమింపబడిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు త్వరితగతిన ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కో–ఆర్డినేటర్ జి. గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్–5, 6 లకు సెలవులు సర్వీస్ రిజిస్టర్‌లో ఇంకా నమోదు చేయడం లేదని, సెలవులు నమోదు చేసేలా మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన సచివాలయ ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హత కలిగిన వారికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన ‘లో కాస్ట్ స్టడీ ల్యాంప్’కు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. గత మార్చి నెల 28వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రదర్శన పోటీల్లో కూడా షార్ట్ లిస్ట్‌లో స్థానం సాధించింది. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ అమెజాన్ సంస్థ రూ. 2 వేలు నగదు బహుమతి అందించారు. పాల్గొన్న మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 1,000 విలువచేసే కిట్స్‌ను ఈ నెల 11న ఈఎండీపీ డిస్ట్రిక్టు మేనేజర్ జంపాన భాను కిరణ్ విద్యార్థులకు అందించి సత్కరించారు. విద్యార్థులు పి. నిఖిల్, కె. మహేష్‌కుమార్, కె. బాలవర్ధన్, ఎన్. లావణ్య, ఎం. హర్షితలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

అరుణాచలం గిరిప్రదక్షిణ ప్రత్యేక బస్సులు

గుడివాడ టౌన్: గుడివాడ, పరిసర ప్రాంతాల ప్రయాణికులు, భక్తులకు ఏపీఎస్ఆర్టీసీ గుడివాడ డిపో నుంచి ప్రతి నెలా పౌర్ణమి రోజు అరుణాచలం గిరిప్రదక్షిణ చేసుకునేందుకు భక్తులకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలానికి వెళ్లు బస్సు మే 3వ తేదీ రాత్రి 8.00 గంటలకు గుడివాడ నుంచి బయలుదేరి నాల్గవ తేదీ ఉదయం శ్రీకాళహస్తి చేరుకుని, మధ్యాహ్నం కాణిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, సాయంత్రం సిరిపురం నందు గోల్డెన్ టెంపుల్, అదే రోజు రాత్రి బయలుదేరి తే 5–5–2023ది పౌర్ణమి రోజు ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, దర్శనం చేసుకుని అదే రోజు సాయంత్రం బయలుదేరి మే 6వ తేదీ ఉదయం ఏడు గంటలకు గుడివాడకు చేరుకుంటారు. సూపర్ లగ్జరీ బస్సు 2+2 సీటర్, పుష్ బ్యాక్ టికెట్ ధర రూ.3,000 అని తెలిపారు. గుడివాడ, పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

మొవ్వ: మండలంలో ఖాళీగా ఉన్న 16 వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వలంటీర్ పోస్టులు భర్తీ చేయనున్న ఏడు గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న 30 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈఓపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు, గౌతమ్‌లు ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లు చేశారు.

కలిదిండిలో వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మండవల్లి: కలిదిండి శాఖ గ్రంథాలయంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అనే అంశంపై బుధవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ హైస్కూల్ కలిదిండి, శశి ఇంగ్లీషు మీడియం, హైస్కూల్, కలిదిండి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పాండురంగారావు, శశి స్కూల్ ఉపాధ్యాయులు ఉదయశంకర్ పాల్గొన్నారు.

చంద్రబాబు సమీక్షించే స్థలం పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలో గురువారం ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు గ్రామస్తులతో నిర్వహించే సమీక్ష సమావేశ స్థలాన్ని ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యురాలు గ్రామస్తులతో కలిసి బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సభా స్థలిని, అక్కడి పరిస్థితులను అడిగి రామకృష్ణ తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం స్థానిక ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద శతజయంతి వేడుకల్లో చంద్రబాబు పాల్గొంటారని పేర్కొన్నారు.

రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ప్రస్తుతం రైతుల వద్ద మిగిలిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి రైతులకు సకాలంలో ఆదుకుంటామని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో నియోజవర్గ స్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో రైతులు పండించిన ధాన్యాన్ని చాలా వరకు కొనుగోలు చేసి, వాటికి నగదు జమ చేసినట్లు తెలిపారు. రైతుల వద్ద ఇంకా మిగిలిన ఉన్న ధాన్యాన్ని కూడా సకాలంలో కొనుగోలు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు ఎవ్వరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో కొనుగోలు చేసి టెక్నికల్ సమస్యల కారణంగా కొంత కాలం కొనుగోళ్లను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిలుపుదల చేసిన కొనుగోళ్లను పునః ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు వీవీ భరత్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, సత్యనారాయణ, నాగభూషణం, శివయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



గన్నవరంలో పంట బోదె పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



ఐనంపూడిలో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

మండవల్లి: గన్నవరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంచినీటి చెరువుకు వెళ్లే పంట బోదె తవ్వకం పనులను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ పంట బోదె తవ్వకం పనులు 62 మంది కూలీలు చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధి పనుల ద్వారా రైతుల పంట కాలువలు అభివృద్ధి చెంది సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలు పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఐనంపూడి(పామర్రు): ఉపాధి హామీ పనులతో ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని గ్రామ సర్పంచ్ భట్టు పరంజ్యోతి అన్నారు. మండలంలోని ఐనంపూడి గ్రామంలో బుధవారం ఉపాధి పనులను ప్రారంభించారు. గ్రామస్తులు బీవీ రాఘవులు, ఫీల్డు అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి

కై కలూరు: ముందస్తు జాగ్రత్త చర్యలతోనే అగ్నిప్రమాదాలు నివారించడం సాధ్యపడుతుందని కైకలూరు అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ అన్నారు. ఇందుకు సంబంధించి మూడురోజులుగా అగ్నిమాపక కేంద్రం పరిధిలోని పరిశ్రమలు, ఆసుపత్రులు, హోటళ్ల సిబ్బంది స్థానిక విజ్ఞాన కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకముందే మేల్కొంటే ఆస్తి, ప్రాణనష్టాలను నివారించగలమన్నారు. ప్రధానంగా పరిశ్రమలు, ఆసుపత్రులు, హోటళ్లల్లో పనిచేసే సిబ్బంది తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధిత యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను శిక్షణలో విపులంగా వివరించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కై కలూరు: మే నెల 10న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్–2023) రాసే అభ్యర్థులకు కలిదిండి జెడ్పీ హైస్కూల్లో ఉన్న వైఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీఎస్‌వీఎస్ ప్రసాద్ బుధవారం పేర్కొన్నారు. శిక్షణ తరగతులు కళాశాల అధ్యాపకులతో ఈ నెల 17 నుంచి మే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరులోపు దరఖాస్తు ఫారం సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.